


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 123 | ఆదివారం 04 అక్టోబర్ 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## క్యూ-శివ, అమరావతి డిక్లరేషన్..

### పాన్ ఐఐటీ సమ్మిట్ లో కీలక ఘట్టాలను ఆవిష్కరించిన చంద్రబాబు



ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు సాంకేతిక ప్రగతికి, పెట్టుబడులకు కేంద్రంగా నిలవనుందనడానికి విజయవాడలో జరిగిన పాన్ ఐఐటీ అమరావతి సమ్మిట్ 2026 నిలువుటద్దం పట్టింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు కీలక ఘట్టాలు ఆవిష్కృతమయ్యాయి. డీప్‌టెక్నాలజీ అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తూ చారిత్రక 'అమరావతి డిక్లరేషన్' విడుదల చేయడంతో పాటు, "మేకిన్ అమరావతి" సంకల్పంతో రూపొందించిన ఐదు "క్యూ-శివ" క్వాంటం -మిగతా2లో

## డే పాస్‌తో ఆర్టీసీ బస్సు, మెట్రో రైలులో ప్రయాణించిన మంత్రులు



తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పలువురు మంత్రులతో కలిసి మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ రవాణాను మరింత సులభతరం చేయడం కోసం ఆర్టీసీ – మిగతా2లో

**బస్సులో బేగంపేట మెట్రోకు చేరుకున్న మంత్రులు**

**జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వరకు మెట్రో రైలులో ప్రయాణం**

## ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నీటి కొరత



**పంటలకు స్ప్రింక్లర్లను సబ్సిడీ పై అందించేందుకు చర్యలు**

**కొన్ని రకాల విత్తనాలకు వందశాతం సబ్సిడీ**

ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నీటి కొరత ఉందని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. యాసంగిలో తక్కువ నీటితో మిగతా2లో

## చంద్రబాబుకు ఇప్పుడు యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది




ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం అనే బలమైన సాఫ్ట్‌వేర్‌కు, యువతతో నిండిన చురుకైన హార్డ్‌వేర్ టీమ్ ఇప్పుడు అండగా నిలిచిందని,ఈ అరుదైన కలయికతో ఆంధ్ర ప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయవాడలో జరిగిన 'పాన్ ఐఐటీ సమ్మిట్ – 2026'లో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి మిగతా2లో

## రేవంత్ కుటుంబ వ్యాపారాలపై విచారణ జరపాలి




**కాంగ్రెస్ పాలనలో సీఎం కుటుంబ వ్యాపారాలు అమాంతం పెరిగాయని విమర్శ**

**మెడికవర్ తదితర సంస్థలపై విచారణకు డిమాండ్**

**తన ఆరోపణలు తప్పైతే క్షమాపణ చెబుతానని వ్యాఖ్య**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబంపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేళ్లలో సీఎం కుటుంబానికి సంబంధించిన వ్యాపా రాలు అమాంతం విస్తరించాయని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2లో




## వరంగల్ ఎయిర్‌పోర్టు పనుల్లో ముందడుగు బౌండరీ వాల్‌కు టెండర్ ఖరారు

**ప్రహరీ నిర్మాణానికి టెండర్ ఖరారు చేసిన ఏఏఐ**

**రూ.13.28 కోట్లకే పనులు దక్కించుకున్న సైదాక్స్ ఇన్ఫ్రా**

వరంగల్ (మామనూరు) ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనుల్లో కీలక ముందడుగు పడింది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) మొదటి దశ పనులకు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి కాంట్రాక్టు సంస్థను ఖరారు చేసింది. 2లో

## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు..

**తొలుత అక్టోబర్ 4న పర్యటనకు ఖరారైన షెడ్యూల్**

**మెదక్, కరీంనగర్‌లో పర్యటనకు ఏర్పాట్లు పూర్తి**



కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగా ణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం ఆయన రాష్ట్రాని కి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దాని కి గల కారణా లేంటో అధికారికంగా మిగతా2లో

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# క్యూ-శివ, అమరావతి డిక్లరేషన్.. పాన్ ఐఐటీ సమ్మిట్ లో కీలక ఘట్టాలను ఆవిష్కరించిన చంద్రబాబు

డీప్‌టెక్నాలజీ అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తూ చారిత్రక 'అమరావతి డిక్లరేషన్' విడుదల చేయడంతో పాటు, "మేకిన్ అమరావతి" సంకల్పంతో రూపొందించిన ఐదు "క్యూ-శివ" క్వాంటం కంప్యూటర్లను సీఎం ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్ సంస్థ, చండీఘడ్ యూనివర్సిటీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్యూ-శివ కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం ల్యాబ్‌లుగా పనిచేస్తాయి. వీటితో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్ 'సృష్టి'ని కూడా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యూబిట్ సంస్థ సీఈఓ వెంకటసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఈ కంప్యూటర్ల తయారీకి అవసరమైన కొన్ని కీలక కాంపోనెంట్లు ప్రపంచంలో ఒకటి రెండు చోట్ల మాత్రమే లభిస్తాయని, అలాంటివి మన మచిలీపట్నంలో దొరకడం విశేషమని తెలిపారు. తమ ప్రయత్నానికి సీఎం చంద్రబాబు అందించిన సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. అనంతరం క్యూబిట్ ప్రతినిధుల కృషిని అభినందించిన ముఖ్యమంత్రి, వారితో కలిసి సెల్ఫీ దిగి ఉత్సాహపరిచారు.




### అమరావతి డిక్లరేషన్.. డీప్‌టెక్‌కు ఊతం

ఈ సదస్సులో ఏపీ ప్రభుత్వం, పాన్ ఐఐటీ అలుమ్ని ప్రతినిధులు సంతకాలు చేసిన 'అమరావతి డిక్లరేషన్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని ప్రకారం, అమరావతిలో ఏపీ ప్రభుత్వం-పాన్ ఐఐటీ అలుమ్ని ఇండియా ఆధ్వర్యంలో ఒక శాశ్వత కౌన్సిల్ ఏర్పాటు కానుంది. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు రూ.500 కోట్ల పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ కౌన్సిల్ ద్వారా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, స్టార్టప్‌లను సమన్వయం చేస్తారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 10 ఇండస్ట్రీ చైర్స్ ఏర్పాటు చేయడం, 100 మంది గ్లోబల్ ఐఐటీ మెంటర్లతో స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేయడం, 23 ఐఐటీల నుంచి టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ వంటివి ఈ డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలు. క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి, 2030 నాటికి కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు.

### క్వాంటం వ్యాలీగా అమరావతి: సీఎం చంద్రబాబు

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "గతంలో ఐటీని ప్రోత్సహిస్తే ప్రపంచవ్యాప్తంగా మన తెలుగువారు నిపుణులుగా ఎదిగారు. ఇప్పుడిక సిలికాన్ వ్యాలీ గురించి కాదు, అమరావతిలోని క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం చర్చించుకుంటుంది" అని ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను విజన్ 2020 తీసుకువచ్చినప్పుడు కొందరు '420' అంటూ హేళన చేశారని, కానీ దాని ద్వారానే విద్యుత్, రహదారుల వంటి రంగాల్లో సంస్కరణలు వచ్చాయని గుర్తుచేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదగడాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. జాతి నిర్మాణంలో భాగమైన ఐఐటీయన్లు వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఐబీఎం-టీసీఎస్, ఎల్ అండ్ టీ సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అమరావతి నుంచే ప్రారంభమవుతాయని చంద్రబాబు ప్రకటించారు. భవిష్యత్తులో కేవలం వినియోగించుకోవడమే కాకుండా, క్వాంటం కంప్యూటర్లను తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఆంధ్రప్రదేశ్ చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# డే పాస్‌తో ఆర్టీసీ బస్సు, మెట్రో రైలులో ప్రయాణించిన మంత్రులు

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పలువురు మంత్రులతో కలిసి ఈరోజు మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ రవాణాను మరింత సులభతరం చేయడం కోసం ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ తీసుకొచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో దీనిని ఆటోలు, క్యాబ్‌లకు అనుసంధానించే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. శనివారం డే పాస్‌తో మంత్రులతో కలిసి ఆయన ఆర్టీసీ బస్సులో బేగంపేట మెట్రో స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా తనతో పాటు ప్రయాణించిన మంత్రులకు, భట్టి విక్రమార్క కాంబో పాస్ కొనుగోలు చేశారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించడం, ప్రజా రవాణా వైపు ప్రయాణికులను ఆకర్షితులను చేయడం కోసం ఈ పాస్ తీసుకొచ్చినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ప్రస్తుతం వీటిని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలపై ఆర్థిక భారం పడకుండా చూస్తామని తెలిపారు. కాంబో పాస్‌పై ప్రయాణించిన మంత్రుల్లో వివేక్, అజారుద్దీన్ తదితరులు ఉన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నీటి కొరత

ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నీటి కొరత ఉందని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. యాసంగిలో తక్కువ నీటితో పండే పంటల వైపు రైతులు మళ్లాలని సూచించారు. స్వల్పకాలిక.. తక్కువ పెట్టుబడి పంటలను ఎంచుకోవాలని నిర్దేశించారు. శనివారం సచివాలయంలో మీడియాతో మంత్రి తుమ్మల మాట్లాడారు. పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును అన్నదాతలు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. రైతు నేస్తం 109వ ఎపిసోడ్‌లో రబీ విత్తన పంపిణీని ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. చీఫ్‌ూవీ, చీవీజుూ-హూ పథకాల కింద విత్తనాలను పంపిణీ చేస్తునట్లు వెల్లడించారు. ఆయా ప్రాజెక్టుల్లో నీటి నిల్వల ఆధారంగా సాగునీటి ప్రణాళిక రచిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో నీటి పారుదల ప్రణాళిక అమలు చేయాలని సూచించారు.

### పంటలకు స్ప్రింక్లర్లను సబ్సిడీపై అందించేందుకు చర్యలు...

మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను రైతన్నలు ఎంచుకోవాలని మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు. వేరుశనగలో నూతన విత్తన రకాలను అభివృద్ధి చేయాలని చెప్పుకొచ్చారు. ఇతర పంటలకు స్ప్రింక్లర్లను సబ్సిడీపై అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఆయిల్‌పామ్ గెలలను వేగంగా ఫ్యాక్టరీలకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అన్నదాతలకు చెల్లింపులను త్వరితగతిన జరిగేలా చూస్తామని మాటిచ్చారు. నూనెగింజల విత్తనాల కోసం రూ.49.35 కోట్లను కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రానికి ఇప్పటికే రూ.34.55 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. 52,425 ఎకరాలకు 29,375 క్వింటాళ్ల విత్తనాలను ధ్రువీకరించినట్లు తెలిపారు.

### కొన్ని రకాల విత్తనాలకు వందశాతం సబ్సిడీ..

రూ.36.76 కోట్ల సబ్సిడీతో నూనెగింజల విత్తనాలను పంపిణీ చేస్తామని మంత్రి తుమ్మల అన్నారు. వేరుశనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, నువ్వుల విత్తనాలను పంపిణీ చేస్తామని వివరించారు. పప్పుధాన్యాల కోసం రూ.34.60 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. 21 జిల్లాల్లో 29,008 క్వింటాళ్ల పప్పుధాన్యాల విత్తనాలను పంపిణీ చేస్తామని అన్నారు. శనగ, మినుము, పెసర విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేస్తామని చెప్పారు. విత్తనాలకు 50 నుంచి 75 శాతం వరకు సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. కొన్ని రకాల విత్తనాలకు వందశాతం సబ్సిడీ ఇస్తున్నట్లు మంత్రి నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# వరంగల్ ఎయిర్‌పోర్టు పనుల్లో ముందడుగు.. బౌండరీ వాల్‌కు టెండర్ ఖరారు

వరంగల్ (మామనూరు) ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనుల్లో కీలక ముందడుగు పడింది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) మొదటి దశ పనులకు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి కాంట్రాక్టు సంస్థను ఖరారు చేసింది. ఎయిర్‌పోర్టుకు కొత్తగా సేకరించిన భూమికి రక్షణ గోడ (బౌండరీ వాల్) నిర్మించే పనులను హైదరాబాద్‌కు చెందిన సైదాక్స్ ఇంజనీర్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకుంది. ఈ కాంట్రాక్టును సెప్టెంబర్ 29న ఖరారు చేశారు. ఈ పనుల కోసం ఏఏఐ రూ.21.39 కోట్లను అంచనా వ్యయంగా నిర్ణయించగా, సైదాక్స్ సంస్థ కేవలం రూ.13.28 కోట్లకే పనులు పూర్తి చేస్తామని బిడ్ దాఖలు చేసింది. ఇది అంచనా వ్యయం కంటే 37.89 శాతం తక్కువ. దీనివల్ల ప్రభుత్వానికి దాదాపు రూ.8.10 కోట్లు ఆదా కానుంది. కాంట్రాక్టు ప్రకారం, కొత్తగా సేకరించిన 283 ఎకరాల భూమి చుట్టూ ప్రీకాస్ట్ బౌండరీ వాల్ నిర్మించడంతో పాటు, పాత ప్రహరీ ఎత్తును కూడా పెంచనున్నారు. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) నిబంధనలకు అనుగుణంగా ఈ పనులు జరుగుతాయి. అక్టోబర్ 9న పనులు ప్రారంభించి, 15 నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒప్పందం ప్రకారం, అక్టోబర్ 14లోపు సైదాక్స్ కంపెనీ ప్రతినిధులు హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టులోని ఏఏఐ కార్యాలయంలో అధికారిక ఒప్పందంపై సంతకాలు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం రూ.285 కోట్లతో భూసేకరణ పూర్తి చేసి ఏఏఐకి అప్పగించిన విషయం తెలిసిందే. ప్రహరీ పనుల తర్వాత టెర్మినల్ బిల్డింగ్, ఏటీసీ టవర్ వంటి ఇతర ముఖ్యమైన నిర్మాణాలకు కూడా టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. 2028 జూన్ నాటికి ఎయిర్‌పోర్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు..

కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు. షెడ్యూల్ ప్రకారం అమిత్ షా రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకు స్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

# రేవంత్ కుటుంబ వ్యాపారాలపై విచారణ జరపాలి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబంపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేళ్లలో సీఎం కుటుంబానికి సంబంధించిన వ్యాపారాలు అమాంతం విస్తరించాయని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి కుటుంబంతో సంబంధం ఉన్న మెడికవర్ హాస్పిటల్స్, మ్యాక్స్ బీఎన్ ఫార్మా, మైండ్ వాల్ కన్‌స్ట్రక్షన్స్, శోదా కన్‌స్ట్రక్షన్స్, స్వచ్ బయో, టెసరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ వంటి సంస్థలు వేగంగా అభివృద్ధి చెందాయని క్రిశాంక్ ఆరోపించారు. ఈ కంపెనీలు భారీ అవకతవకలకు పాల్పడుతున్నాయని, దీనికి సంబంధించిన పత్రాలను ఈడీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాని కార్యాలయం, రాష్ట్రపతి కార్యాలయాలతో పాటు ప్రతిపక్ష నేతలకూ అందజేస్తానని తెలిపారు. ఈ ఆరోపణలపై విచారణకు ముఖ్యమంత్రి ఆదేశించాలని క్రిశాంక్ డిమాండ్ చేశారు. కొన్ని కంపెనీలలో దుంప శిరీష డైరెక్టర్‌గా ఉండటం వెనుక ఉన్న పాత్రను కూడా తేల్చాలన్నారు. తన ఆరోపణలు అవాస్తవమని తేలితే, మరోసారి ప్రెస్ మీట్ పెట్టి రేవంత్ రెడ్డి కుటుంబానికి బహిరంగ క్షమాపణ చెబుతానని స్పష్టం చేశారు. ఇలాంటి అంశాలను ప్రస్తావిస్తున్నందుకే తనను రెండుసార్లు జైలుకు పంపారని, తన ఇంటి తలుపులు పగలగొట్టారని, తన బిడ్డను కూడా బెదిరించారని క్రిశాంక్ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఆస్తులు, భూముల విషయంలో ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్న నేపథ్యంలో క్రిశాంక్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# చంద్రబాబుకు ఇప్పుడు యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది

"ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం 4.0 ఆపరేటింగ్ సిస్టమ్‌తో మరింత ఉత్సాహంగా పనిచేస్తున్నారు. ఆయనకు ఇప్పుడు ఒక యంగ్ హార్డ్‌వేర్ టీమ్ అండగా ఉంది. మా శాసనసభ్యుల్లో 50 శాతం మంది మొదటిసారి గెలిచినవారే. 25 మంది మంత్రులలో 17 మంది తొలిసారి మంత్రులయ్యారు. అనుభవజ్ఞమైన సాఫ్ట్‌వేర్‌కు, ఈ యువ, డైనమిక్ హార్డ్‌వేర్ కలయికే నేటి ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెడుతోంది. ఏ రంగంలోనైనా ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా ఉండాలన్నదే మా స్పష్టమైన విజన్" అని లోకేశ్ వివరించారు. 5 లక్షల మందికి పైగా ఐఐటీ గ్రాడ్యుయేట్లను కలిపే పాన్ ఐఐటీ సదస్సు ఏపీలో జరగడం ఆనందంగా ఉందన్నారు.

### అమలుపైనే దృష్టి.. ఇవే మా నిదర్శనాలు

కేవలం కాగితాలపై హామీలు కాకుండా, వాస్తవంగా అమలవుతున్న ప్రాజెక్టుల గురించి లోకేశ్ సవివరంగా మాట్లాడారు. "ఏపీలో నమో అంటే నాయుడు జీ, మోదీజీ జోడీ. డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉండటం వల్లే పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏపీని గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా మార్చాలన్న సీఎం సంకల్పంతో రిలయెన్స్ భాగస్వామ్యంతో మదనపల్లెలో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు శంకుస్థాపన చేశాం. ఇది లక్ష కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తుంది" అని తెలిపారు. "ఇతర రాష్ట్రాల్లో దశాబ్దాలుగా నిలిచిపోయిన ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టుకు కేవలం 17 నెలల్లోనే పునాది వేశాం. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని 13 నెలల్లోనే అనుమతులు సాధించి పనులు ప్రారంభించాం. దేశంలో ఎవరూ ఊహించని ధరకు స్పేస్ టెక్ స్టార్టప్ స్కైరూట్‌కు 300 ఎకరాలు కేటాయించాం. మారిటైమ్ డ్రోన్లు తయారుచేసే సాగర్ డిఫెన్స్ సంస్థకు ఫిషింగ్ హార్బర్‌లో స్థలం ఇవ్వగా, 18 నెలల్లో ఆ సంస్థ విలువ రూ.3,000 కోట్ల నుంచి రూ.23,000 కోట్లకు పెరిగింది. ఇదే మా ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం" అని లోకేశ్ పేర్కొన్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 04 అక్టోబర్ 2026

# సంపాదకీయం

## 'ప్రభుత్వ వ్యతిరేకత'కు బీజేపీ అతీతమా?



రాహుల్‌గాంధీ ఇటీవల ఒక ప్రశ్న అడిగారు. రాజకీయ వర్గాలలో కలకలం సృష్టించిన ఆ ప్రశ్న సులభంగా ఉన్నట్టు కనిపిస్తున్నా నిజానికి సంక్లిష్టమైనది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, భారతీయ జనతా పార్టీ ఒక దశాబ్దానికి పైగా అధికారంలో ఉన్నప్పటికీ ప్రభుత్వ వ్యతిరేకత ప్రభావానికి ఎందుకు గురికావడం లేదు? 1977లో ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉన్న కారణంగా మా నానమ్మ ఇందిర సైతం ఓడిపోయారు అని ఆయన అన్నారు. మోదీ నేతృత్వంలోని బీజేపీ అధికారంలో కొనసాగేలా ఎన్నికల ప్రక్రియను తారుమారు చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఇది చాలా తీవ్రమైన ఆరోపణ. ఎన్నికల్లో జయాపజయాల విషయమై రాహుల్ ఇటీవల చేసిన వివిధ వ్యాఖ్యలలో మాదిరిగానే తాజా ఆరోపణలో కూడా ఒక ఇబ్బందికరమైన సత్యం ఉంది. ఒక విషయంలో రాహుల్ సరిగానే మాట్లాడారు. ఎన్నికల సంఘం తీవ్ర విశ్వసనీయత లోటును ఎదుర్కొం టోంది. అవును, ఈ సత్యం ఇంకెంత మాత్రం ఒక చర్చనీయాంశంగా ప్రతిపక్షాలకే పరిమితమై లేదు. ఈసీఐపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారనడం సత్యదూరం కాదు. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై వివాదం, పశ్చిమ బెంగాల్‌లో ఓటర్లు నివేదించిన వివరాల లో 'తార్కిక వ్యత్యాసం'కు సంబంధించిన సమస్యలు, లక్షలాది ఓటర్ల తొలగింపుపై రగడ, ఓటర్ల అప్పీళ్లపై విచారణలో జాప్యం మొదలైనవన్నీ ఎన్నికల సంఘం పారదర్శకతపై న్యాయబద్ధమైన ప్రశ్నలను లేవనెత్తుతు న్నాయి. రాజ్యాంగ సంస్థల మధ్య 'విశ్వాస లోటు' ఉన్నదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించిందంటే పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసు కోవచ్చు. ఓటర్ జాబితాల ధర్మబద్ధత గురించి పట్టించుకునే ఎవరికైనా ఈ అంకెలు ఆందోళన కలిగిస్తాయి. బెంగాల్‌లో ఇంతవరకు 22 లక్షల మంది పౌరులు తమ ఓటు హక్కు తొలగింపుపై అప్పీల్ చేశారు. విచారణ పూర్తయిన అప్పీళ్లలో 93శాతం మంది చట్టబద్ధమైన ఓటర్లే అని నిర్ధారణ అయింది. ఎన్నికలు అంటే కేవలం పోలింగ్ రోజున జరిగే ప్రక్రియ మాత్రమే కాదు. ఓటర్ జాబితాలలో ఎవరికి చోటు దక్కుతుందనే అంశం తోనే నిజానికి ఎన్నికలు ప్రారంభమవుతాయి. మరి తన పనితీరుపై ఆందోళనలను కేవలం రాజకీయ ఆరోపణలు మాత్రమేనని ఎన్నికల సంఘం ఎలా కొట్టివేయగలుగుతుంది? ఎన్నికల సంఘం తటస్థ మధ్యవర్తి గా వ్యవహరించడం లేదనే ఆందోళనలు ఇటీవల వివిధ అసెంబ్లీ ఎన్నికల ను నిర్వహించిన తీరుతెన్నుల ఆధారంగానే వ్యక్తమవుతున్నాయన్నది నిరాకరించలేని వాస్తవం. మన దేశంలో ఒపీనియన్ పోల్స్ నిర్వహించే ఏజెన్సీలు కూడా రాజకీయ కుట్రల్లో భాగమా? 2014 నుంచి నరేంద్ర మోదీకి ప్రజాదరణ- ముఖ్యంగా హిందీ భాషా రాష్ట్రాలలోను, పశ్చిమ భారత రాష్ట్రాలలోనూ అంతకంతకూ పెరుగుతోందని అన్ని ఒపీనియన్ పోల్స్ ఫలితాలు నిర్ధారిస్తూనే ఉన్నాయి. ఆ పోల్స్ అన్నీ ప్రామాణిక పద్ధతులలో జరిగి ఉండకపోవచ్చు. అయినంతమాత్రాన వాటి ఫలితాలకు కారణమైన రాజకీయ పరిణామాన్ని కొట్టివేయడం సబబు కాదు. దానిని నిష్పాక్షికంగా అర్థం చేసుకోవాలి. కాంగ్రెస్ పార్టీకి అసాధ్యంగా ఉన్న మహా శక్తిమంతమైన రాజకీయ, సంస్థాగత యంత్రాంగాన్ని బీజేపీ అభివృద్ధి పరచుకున్నది. కార్యకర్తల బలాన్ని అపారంగా పెంచుకున్నది. పైగా ఆరెస్సెస్ నుంచి సంపూర్ణ మద్దతు బీజేపీకి లభిస్తోంది. ఆర్థిక వనరులు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయి. పార్టీ సందేశాలను ప్రభావదాయకం గా ప్రజలలోకి తీసుకువెళ్లే సామర్థ్యం తక్కువేమీ కాదు. కనుకనే జాతీయ ప్రాధాన్యమున్న అంశాలను ఎన్నికల ప్రచారానికి చాలా నేర్పుగా, ప్రయోజనకరంగా ఉపయోగించుకోవడంలో బీజేపీ సదా సఫలమవుతోంది. ఎన్నికల వ్యయాలపై ఈసీఐకి నివేదించిన వివరాల ప్రకారం, ఈ ఏడాది ఐదు రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ మొత్తం రూ.529.38 కోట్లు ఖర్చు చేసింది. ఆ ఐదు రాష్ట్రాలలో కాంగ్రెస్ చేసిన వ్యయం రూ. 248.55 కోట్లు. బీజేపీ ఒక్క బెంగాల్‌లోనే చేసిన వ్యయం, ఐదు రాష్ట్రాలలో కాంగ్రెస్ ఖర్చు చేసిన మొత్తం కంటే ఎక్కువగా ఉన్నది. ఈసీఐ వెల్లడించిన లెక్కల ప్రకారం, బెంగాల్‌లో బీజేపీ ఎన్నికల వ్యయం రూ.286.99 కోట్లుగా ఉన్నది. ఆయా పార్టీలు చేసిన వ్యయాలు ఇంకా అధికంగా ఉంటాయనడంలో సందేహం లేదు. అయితే అవేవీ ఎన్నికలలో అక్రమాలు జరిగాయన్న విషయాన్ని రుజువు చేయలేవు. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల కాలంలోనే తమకు అందిన విరాళాలు మొత్తం రూ.1,473 కోట్లు అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యాలయం వెల్లడించింది. అదే కాలంలో కాంగ్రెస్ కు విరాళాల రూపేణా కేవలం రూ.207 కోట్లు మాత్రమే సమకూరాయి. చెప్పవచ్చినదేమిటంటే ఒక శక్తిమంతమైన ఎన్నికల యంత్రాంగం ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవడానికి ఎలాంటి కుట్ర సిద్ధాంతాలు అవసరం లేదు. గతంలో దశాబ్దాలుగా అధికారంలో ఉన్న ప్రధాన ప్రతిపక్షం అధికార పార్టీతో సమానంగా సమర్థ యంత్రాంగాన్ని ఎందుకు నిర్మించుకోలేక పోయింది? ఈ ప్రశ్నను రాహుల్‌గాంధీ ఎదుర్కోవాలి. కాంగ్రెస్‌కు వాటిల్లిన సమస్యలన్నిటికీ ఈసీఐని తప్పుపట్టడం ఎంతమాత్రం వివేకం కాదు.

# ప్రజల ఆస్తులకు.. ప్రభుత్వ రాజముద్ర





- పాసు పుస్తకాలలో పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

**ఆత్మకూరు అక్టోబర్ 3 వార్త సాక్ష్యం**

మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమన్ని ఆత్మకూరు తాసిల్దార్ రత్న రాధిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ హయంలో తప్పుల తడకగా రీసర్వే, ప్రజల ఆస్తులపై జగన్ బొమ్మతో, కుట్రలు,ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తో ప్రజల ఆస్తులు కాజేసేందుకు నాడు వైఎస్ జగన్ కుట్ర చేశాడని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించిందన్నారు. పారదర్శంగా సర్వే చేయించి, ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తున్నాం అన్నారు.రూ.30 కోట్లతో బుడ్డా వెంగళరెడ్డి సిద్దాపురం ఎత్తిపోతల పథకం నుంచి వెంకటాపురం, బైర్లుటి, కృష్ణాపురం, అమలాపురం, శ్రీపతిరావు పేట, ఇందిరేశ్వరం గ్రామాల్లోని మరో ఐదువేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూపకల్పన సిద్ధం చేస్తున్నామని త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. అన్నదాతల సంక్షేమమే ఎన్డీయే ప్రజా ప్రభుత్వ ధ్యేయం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని అందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఎన్డీయే ప్రభుత్వం అన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా లేనివిధంగా అధిక నిధులతో ఆత్మకూరు మండలాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నామని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించి, అభివృద్ధి చేసే నాయకులకు అండగా నిలవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మోర్చా నాయకురాలు మోమిన్ షబానా, వెంకటాపురం మాజీ సర్పంచ్ మహానంది గంగాదేవి, టిడిపి మండల అధ్యక్షుడు రవీంద్రబాబు, పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల్, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి పఠాన్ నాగూర్ ఖాన్, సింగిల్ విండో చైర్మన్ షాబుద్దీన్, వి ఆర్ ఎస్ పి ప్రాజెక్ట్ చైర్మన్ మల్లికార్జున్ రెడ్డి, మైనార్టీ నాయకులు కలిముల్లా, నబీ, జనసేన నాయకులు శ్రీరాములు, సచివాలయ సిబ్బంది, పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రొమ్ము క్యాన్సర్ పై అవగాహనతో పాటు ముందస్తు గుర్తింపే కీలకం

- పింక్ మారథాన్ ద్వారా ఆరోగ్య చైతన్యానికి పిలుపు
- ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**నంద్యాల అక్టోబర్ 3 వార్త సాక్ష్యం**





రొమ్ము క్యాన్సర్‌పై మహిళల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స పొందేలా చైతన్యం తీసుకురావడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి, నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. రొమ్ము క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు శనివారం నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్ నుంచి టెక్కె వ్యవసాయ మార్కెట్ యార్డ్ వరకు నిర్వహించిన పింక్ మారథాన్ ర్యాలీని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, కలెక్టర్ ప్రారంభించి, ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని, మహిళల్లో కనిపించే ముఖ్యమైన క్యాన్సర్‌లలో రొమ్ము క్యాన్సర్ ఒకటని, దీనిపై ప్రతి మహిళకు అవగాహన ఉండటం అత్యంత అవసరమన్నారు. కుటుంబ బాధ్యతలు, ఇంటి పనుల్లో నిమగ్నమై చాలామంది మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. రొమ్ము భాగంలో గడ్డలు, అసాధారణ నొప్పి, చర్మంలో మార్పులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రతి గడ్డ క్యాన్సర్‌ను సూచించదని, అనవసర భయాలకు లోనుకాకుండా వైద్యుల సలహా తీసుకుని అనుమానాలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు. మహిళలు క్రమం తప్పకుండా స్వీయ పరిశీలన చేసుకోవడంతో పాటు, వైద్యుల సూచన మేరకు అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎంపీ కోరారు. భయం, బిడియంతో ఆరోగ్య సమస్యలను దాచిపెట్టకుండా కుటుంబ సభ్యులతో చర్చించి, అవసరమైన సమయంలో వైద్యులను సంప్రదించడం ద్వారా వ్యాధిని ముందస్తుగా గుర్తించి సకాలంలో చికిత్స పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంలో భాగంగా మామోగ్రఫీ, సోనోమామోగ్రఫీ వంటి పరీక్షలకు రాయితీలు అందుబాటులో ఉన్నాయని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎంపీ బైరెడ్డి శబరి కోరారు. నంద్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ఆధునిక వైద్య సాంకేతికత అందుబాటులో ఉందన్నారు. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, ముందస్తు వైద్య పరీక్షల ప్రాధాన్యతపై మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పింక్ మారథాన్‌లో మహిళా, పురుష వైద్యులు, విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు పింక్ క్యాప్‌లు ధరించి పెద్ద సంఖ్యలో పాల్గొనడం ద్వారా రొమ్ము క్యాన్సర్‌పై పోరాటానికి తమ సంఘీభావాన్ని చాటారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆరోగ్య పరిరక్షణ, సామాజిక బాధ్యత, ఐక్యతకు ప్రతీకగా ఈ కార్యక్రమం నిలిచిందన్నారు. పింక్ మారథాన్‌ను నిర్వహించిన వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు, ప్రజలకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా హాజరైన నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి జిల్లా యంత్రాంగం తరఫున కలెక్టర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు అరుదైన గౌరవం

- జిల్లా కలెక్టర్, రాష్ట్ర న్యాయశాఖ మంత్రి చేతుల మీదుగా స్వచ్ఛత అవార్డు
- ఆత్మకూరు వైద్యశాలలో శానిటేషన్ సిబ్బందికి అవార్డులతో అభినందనలు
- కార్పొరేట్ హాస్పిటల్ కు దీటుగా ప్రభుత్వ వైద్యశాల

**ఆత్మకూరు అక్టోబర్ 3 వార్త సాక్ష్యం**








గాంధీ జయంతి ని పురస్కరించుకొని నంద్యాల జిల్లాలో నిర్వహించిన జిల్లా స్వచ్ఛ ఆంధ్ర సేవ అవార్డ్స్ కార్యక్రమంలో ఆత్మకూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి స్వచ్ఛత అవార్డు లభించింది. ఈ అవార్డును ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖ రాష్ట్ర మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ మరియు జిల్లా కలెక్టర్ రాజ కుమారి చేతుల మీదుగా వైద్యాధికారి డాక్టర్ రాయుడు అందుకున్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు ఏఎన్ఎంలు, శాంటేషన్ వర్కర్లు తో కలిసి అవార్డుతో హర్షం వ్యక్తం చేసుకున్నారు ప్రైవేటు వైద్యశాలలకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలలో పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో ఈ అవార్డు రావడం జరిగిందని వైద్య అధికారి డాక్టర్ రాయుడు తెలిపారు ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిని పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచడం తో పాటు పారిశుద్ధ్య నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపినందుకు ఈ అవార్డు తన ఒక్కరి కృషికి దక్కినది కాదని, ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది, ఇతర సిబ్బంది, శానిటేషన్ వర్కర్ల సమిష్టి కృషి, సహకారం వల్లే ఈ గుర్తింపు లభించిందని అన్నారు,ఆసుపత్రి పరిసరాలను నిరంతరం పరిశు భ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు ఆసుపత్రి సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపిందని, భవిష్యత్తులోనూ పరిశుభ్రతకు ప్రాధాన్య తనిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిం చేందుకు కృషి చేస్తామని డాక్టర్ రాయుడు తెలిపారు ఈ కార్యక్రమంలో డాక్టర్లు జగదీష్, లక్ష్మీ ప్రసన్న, ఏఎన్ఎంలు, శాంటేషన్ సూపర్వైజర్లు, శాంటేషన్ సిబ్బంది, సగినేల కుమారి, మరియమ్మ, మేరమ్మ, సుజాత, శేషమ్మ, సగినేల ప్రమీలమ్మ, నల్ల కాలువ మేరమ్మ తో పాటు శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# బాలికల విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట



- విద్యాసంస్థల్లో మౌలిక వసతుల బలోపేతమే లక్ష్యం: మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

**బనగానపల్లె, అక్టోబర్ 3,**

అవుకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.1.67 కోట్లతో చేపట్టిన నూతన భవనం ప్రారంభించిన మంత్రి బాలికలకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, వారికి అవసరమైన అన్ని మౌలిక వసతులను సమకూర్చడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. విద్యా రంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా అవుకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.1.67 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు మంత్రి నారా లోకేష్ ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల



కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, విద్యార్థినులకు మెరుగైన తరగతి గదులు, సౌకర్యవంతమైన విద్యా వాతావరణం అందించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.

**విద్యే సమాజ అభివృద్ధికి బలమైన పునాది**

ప్రతి విద్యార్థినికి సమాన అవకాశాలు, నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా బాలికల విద్యకు ప్రోత్సాహం అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంతో పాటు, రాష్ట్ర అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పిస్తామని మంత్రి స్పష్టం చేశారు. విద్యా రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యానికి అవుకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నూతన భవనం నిర్మాణం ఒక ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# మోకాళ్ళ మీద నిలబడి దండాలు పెడుతూ వీఆర్ఏల నిరవధిక సమ్మె





- 18వ రోజుకు చేరిన VRA ల నిరవధిక సమ్మె.. హామీలు అమలు చేయాలంటూ డిమాండ్....

**బండి ఆత్మకూరు వార్తా సాక్ష్యం...**

బండి ఆత్మకూరు: రెండేళ్లు గడిచినా తమ సమస్యలు పరిష్కారం కాలేదంటూ వీఆర్ఏలు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. బండి ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా ఈరోజు వీఆర్ఏలు మోకాళ్ళ మీద నిలబడి దండాలు పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. హామీలు ఇచ్చారు.. రెండేళ్లు గడిచాయి.. కానీ సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని వీఆర్ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. వేతన పెంపు, అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతులు, తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. పెద్దన్న, నంద్యాల జిల్లా అధ్యక్షుడు నారాయణ, బండి ఆత్మకూరు మండల అధ్యక్షుడు బి. శేషు మాట్లాడుతూ.. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతోనే నిరవధిక సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. తెలంగాణ తరహాలో పే స్కేల్ అమలు చేయడంతో పాటు అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారిందని, పని భారం పెరుగుతున్నా వేతనాలు మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ ప్రధాన డిమాండ్లపై వెంటనే నిర్ణయం తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. "హామీలు కాదు.. మా సమస్యలకు పరిష్కారం కావాలి" అంటూ వీఆర్ఏలు నినదించారు.

# క్రీడాకారులకు అన్ని విధాలుగా సహకరిస్తా : ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి





**ఆత్మకూరు అక్టోబర్ 3 వార్త సాక్ష్యం**

శ్రీశైలం నియోజకవర్గ క్రీడాకారులకు అన్ని విధాలుగా సహకరిస్తానని శ్రీశైలం ఎమ్మెల్యే శ్రీ.బుడ్డా రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవలే ఆత్మకూరు పట్టణంలోని ఎన్టీఆర్ కేవీకే స్టేడియం లో శిక్షణ తీసుకొని గోవా లో జరిగే జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని మొదటి స్థానం లో విజేతగా నిలవడం జరిగింది. అలాగే బంగారు మెడల్ సాధించడం జరిగింది. మంచి ప్రతిభ చూపించి నియోజకవర్గానికి మంచి పేరు తెచ్చిన క్రీడాకారులను అభినందించారు. స్టేడియం లో క్రీడాకారులకు తనవంతు సహాకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. స్టేడియంలో క్రీడాకారులకు శిక్షకులచే మెలకువలు నేర్పి మంచి ఫలితాలు సాధించేలా చేస్తున్నా స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా ను అభినందించారు. క్రీడాకారులకు జిల్లాస్తాయి నుంచి అంతర్జాతీయ స్తాయి లో పాల్గొనేలా అందరూ కష్టపడాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. ప్రతి ఒక్కరు చదువుతో పాటు క్రీడల్లో రాణించి దేశానికి మంచి పేరు తేవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ గౌరవ అధ్యక్షులు రేడియం నూర్, ఖోఖో కోచ్ మహేబూబ్,కబడ్డీ శిక్షకులు సతీష్, స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు మరియు క్రీడాకారులు పాల్గొన్నారు

# ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం విజృంభణ

- తల్లికి వందనం బకాయిలను వెంటనే విడుదల చెయ్యాలి

**నందికొట్కూరు అక్టోబర్ 3 వార్త సాక్ష్యం**



తల్లికి వందనం బకాయిలను ప్రభుత్వం వెంటనే విద్యార్థుల తల్లి అకౌంట్లో జమ చేయాలని స్థానిక గవర్నమెంట్ జూనియర్ కాలేజీ నందు పీడీఎస్ యు డివిజన్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో సభా అధ్యక్షత జిల్లా నాయకుడు శ్యాంనాయక్ వహించగా ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పీడీఎస్ యు విద్యార్థి సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కే.ఆది మాట్లాడుతూ జులై 22 నుంచి 24 వరకు నాలుగు విడతల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి తల్లికి వందనం అందిస్తామన్న ప్రభుత్వం మాట మార్చి నేటికీ ఇంకా ఆరు లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం పతకం అందించలేదని వారు అన్నారు ప్రభుత్వం వెంటనే స్పందించి 800కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసి తల్లికి వందనం ఇవ్వాలని వారు తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టలలో వార్డెన్ల కొరత తీవ్రంగా వేధిస్తుంది రెండు లేదా అంతకంటే ఎక్కువ హాస్టల్ లలో ఒకే వార్డెన్ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి వెంటనే ప్రభుత్వం ూ్రాూజ ద్వారా ఎక్కువ వార్డెన్ మరియు స్కావెంజర్ పోస్టులను పెంచాలని వారన్నారు సంక్షేమ హాస్టలు ప్రారంభించి నాలుగు నెలలు అవుతున్న విద్యార్థుల పరిస్థితి కడుదయానికంగా ఉందని ఇంతవరకు ట్రంకు పెట్టెలు బెడ్ షీట్స్ ఇవ్వలేదని వారన్నారు హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు అందించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారన్నారు సంక్షేమ హాస్టల్లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించి ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం విజృంభణ డివిజన్ నాయకులు అంజి, అజయ్, శివాఆది, శశిధర్, దీపక్ నాయక్, జస్వంత్ రాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పార్నపల్లెలో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ...



**బండి ఆత్మకూరు వార్తా సాక్ష్యం...**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం పార్నపల్లి గ్రామంలో తాసిల్దార్ పద్మావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 1061 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. దాంతోపాటు 348 మంది రైతుల ఇనాం/సర్వీస్ ఇనాం నుండి పట్టాగా మార్చి పట్టదారు పాసు పుస్తకములు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీమతి పి. పద్మావతమ్మ,రిసర్వే డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ నాగ ప్రసాద్, గ్రామ రెవెన్యూ అధికారులు, మండల కన్వీనర్ ఎం.కృష్ణా రెడ్డి,గ్రామ పెద్దలు నర్ల రాఘవ రెడ్డి, మురళి మోహన్ రెడ్డి.. రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు తీవ్ర అన్యాయం- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం ప్రకాష్ రెడ్డి

**బనగానపల్లె సెప్టెంబర్ 3,**



సంజామల మండలంలో సాగునీరు అందక వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న సంజామల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడం లో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుండం ప్రకాష్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మండలం లోని రైతులు ఎదుర్కొంటున్న దుస్థితి పై శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ..ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ ఏడాది వర్షాలు సరిగా కురవకపోవడంతో బోరుబావులు ఎండిపోయి, వందలాది ఎకరాల్లో సాగు చేసిన పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నాయని ప్రకాష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి పెట్టిన ప్రతి రైతు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నా, పాలకులకు మాత్రం వారి కష్టాలు పట్టడం లేదని విమర్శిం చారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సంజామల మండలాన్ని కరువు మండలం గా ప్రకటించాలని, నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో రైతులతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరిం చారు. మండలంలోని మండలంలోని టిడిపి నాయకులు రైతుల బాధలను ప్రభుత్వ దృష్టికి తీసుకు పోవడంలో విఫలమయ్యారని ఆయన విమర్శించారు.

## 18వ రోజుకు చేరిన వీఆర్ఏల నిరవధిక సమ్మె



**బనగానపల్లె, అక్టోబర్ 3**

పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా వీఆర్ఏలు చేస్తున్న నిరసన సమ్మె 18వ రోజుకు చేరుకుంది. శనివారం తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా వీఆర్ఏలు రిలే నిరాహార దీక్షలు నిర్వహించి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు తలారి బాలుడు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న తరహాలో వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారందరికీ ఒకేసారి ఉద్యోగ నియామకాలు కల్పించాలని, అర్హులైన వీఆర్ఏలకు 70 శాతం ప్రమోషన్లు కల్పించాలని, విధి నిర్వహణలో ఉన్న వీఆర్ఏలు మరణించిన కుటుంబాలకు వయోపరిమితి లేకుండా ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 18 రోజులుగా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించకపోవడం పై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, తమ కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఐక్యంగా తమ ఆందోళనను కొనసాగి స్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం నాయకులు కే. హరిబాబు, తలారి శ్రీనివాసులు,తలారి ప్రసాద్, తలారి మల్లేష్, తలారి మధుశంకర్, లక్ష్మీకాంత్ శర్మ, రవి, మనోహర్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

## శ్రీ చౌడేశ్వరి దేవస్థానానికి భక్తుల విరాళం



బనగానపల్లె , అక్టోబర్ 3

మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానానికి కోవెలకుంట్ల పట్టణానికి చెందిన కీ"శే" గుద్దేటి పద్మావతి జ్ఞాపకార్థం భర్త గుద్దేటి వెంకట సుబ్బారెడ్డి, వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు 1,00,116/- రూ" (ఒక లక్ష నూట పదహారు రూపాయలు) చందాను ఆలయ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పి.వి.నాగార్జున రెడ్డి ల సమక్షంలో ఆలయ అర్చకులకు శనివారం అందచేశారు.

## ఏపీ డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా కమిటీ సమావేశం



బనగానపల్లె , అక్టోబర్ 3

నంద్యాల పట్టణంలోని అన్న పూర్ణ ఫంక్షన్ హాల్ లో ఏపీ డబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు జి. మద్దయ్య యాదవ్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో ఈ నెల 12వ తేదీన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, జర్నలిస్టుల సమస్యలపై జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వాలని , నవంబర్ 5వ తేదీ ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని నియోజకవర్గ కేంద్రాలలో నిర్వహించాలని తీర్మానించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి. మద్దయ్య యాదవ్, ఎం గిరిబాబు సాగర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మౌలాలి లు మాట్లాడుతూ జిల్లాలోని ఆరులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల కు వెల్ఫేర్ పండ్ ను ఏర్పాటు చేయాలని, రైల్వే పాసులను పునరుద్ధరి ంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నిజాముద్దీన్, నరసింహారెడ్డి, సుబ్బరాయుడు,నాగన్న, ట్రెజరర్ మస్తాన్, ప్రచార కార్యదర్శి సి. హెచ్ .రామారావు, సహాయ కార్యదర్శులు రామచంద్రారెడ్డి, రంగస్వామి, చంద్రబాబు, వేణుగోపాల్, ఏపీ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం. హుస్సేన్ భాష జిల్లా సహాయ కార్యదర్శి ఏ. అణు పాల్, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.వి. సుబ్రహ్మణ్యం, బి. నరసింహులు, పి రాధిక, జి. సుజాత తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత భక్తిశ్రద్దలతో గోపూజ కుంకుమార్చన కార్యక్రమాలు

- డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే



కర్నూలు అక్టోబర్ 3 వార్త సాక్ష్యం

పితృ దేవతలకు అత్యంత ప్రీతికరమైన మహాలయ పక్షం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో పవిత్రమైన గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పాణ్యం మండలం, కౌలూరు గ్రామంలోని శ్రీ సిద్దేశ్వర స్వామి భజన మందిరం నందు గత ఐదురోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోమాతకు పసుపు, కుంకుమ, పూలమాలలతో అలంకరించి, వేద మంత్రోచ్చారణల నడుమ గోపూజ నిర్వహించారు. అనంతరం సౌభాగ్యానికి, ఐశ్వర్యానికి ప్రతీక అయిన గోమాతకు పూజానంతరం కుంకుమార్చన చేయించి, మహిళా భక్తులచే సామూహిక పారాయణం చేయించారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి మాట్లాడుతూ హిందూ సంప్రదాయంలో మహాలయ పక్షాలు పితృ దేవతలను స్మరించుకుని, గోసేవ చేయడం వల్ల పితృదోషాలు తొలగి, పితరులు సంతృప్తి చెందుతారని, గోవులో 33 కోట్ల దేవతలు కొలువై ఉంటారని, గోపూజ చేయడం వలన సమస్త దేవతలను పూజించిన ఫలితం లభించడమే కాకుండా, పితృ దేవతలకు ఉత్తమ గతులు కలుగుతాయని తెలిపారు. మూడురోజులు ప్రముఖ ధార్మిక ప్రవచకులు డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలి నిర్వహించిన భజనలు భక్తులను ఎంతగానో అలరించాయి.

# పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత...







- ఆరోగ్యమే మహాభాగ్యం...
- అటవీ శాఖ అధికారి నాసిర్జ..

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని, ఆరోగ్యమే మహాభాగ్యం అని బండి ఆత్మకు అటవీ శాఖ అధికారి నాసిర్జా అన్నారు. ఈ మేరకు ఆయన తమ సిబ్బందితో కలిసి ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓంకార క్షేత్రంలో ఆలయ పరిసరాలన్నింటిని పరిశుభ్రం చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండి ఆత్మకూరు అటవీశాఖ పరిధిలో వన్యప్రాణి వారోత్సవాలు - 2026 ప్రారంభ కార్యక్రమంలో భాగంగా ఓంకారం ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రజలకు పర్యావరణం, అటవీ మరియు వన్యప్రాణి సంరక్షణపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలు, భక్తులు మరియు హోంకారం ఆలయ చైర్‌పర్సన్ సహకారంతో ఆలయ పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడక్కడా పేరుకుపోయిన ప్లాస్టిక్ బాటిళ్లు, ప్లాస్టిక్ కవర్లు మరియు ఇతర వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం ప్రజలకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అవగాహన కల్పించారు. అలాగే అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని తెలియజేస్తూ ప్రజలతో సంరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ప్రకృతి సంపదను, అడవులను, వన్యప్రాణులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు పిలుపునిచ్చారు.

# ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్నూలులో ఇన్నర్ ఇంజినీరింగ్ కార్యక్రమం

కర్నూలు ప్రతినిధి,అక్టోబర్ 3 వార్త సాక్ష్యం

ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో ఇన్నర్ ఇంజినీరింగ్ కార్యక్రమాన్ని అక్టోబర్ 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రాచీన యోగశాస్త్రాల సారాన్ని ఆధారంగా చేసుకుని రూపొందించిన ఇన్నర్ ఇంజినీరింగ్ కార్యక్రమం మనిషి సంపూర్ణ శ్రేయస్సుకు బాటలు వేసి, ఆనందకరమైన మరియు ఆరోగ్యకరమైన జీవితానికి దోహదపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యోగా,అంతర్గత శ్రేయస్సు, మానసిక సమతుల్యత తదితర అంశాలకు సంబంధించిన సాధనలను పరిచయం చేయనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు.

కార్యక్రమ వేదిక:ఎస్.వి రీజెన్సీ హోటల్,ఎస్.వి.కాంప్లెక్స్, ఆర్.ఎస్.రోడ్,ఎస్‌బీఐ సర్కిల్ సమీపంలో,కర్నూలు.

సమయాలు:ఆదివారం మినహా మిగిలిన అన్ని రోజుల్లో ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు,సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆదివారం రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుంది.అక్టోబర్ 7వ తేదీన ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు,సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఉచిత పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ ఉచిత పరిచయ కార్యక్రమానికి ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ హాజరు




కావచ్చని తెలిపారు.ఆసక్తి ఉన్నవారు http://isha.co/iekurnool వెబ్‌సైట్‌లో లాగిన్ అయి కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమం పై మరిన్ని వివరాలు, సందేహాల కోసం,9663655003,8499980150 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

# ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు, చట్టబద్ధమైన సెలవులు ఇవ్వాలి





ఆత్మకూరు అక్టోబర్ 3 వార్త సాక్ష్యం

ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షురాలు శాంతి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని రహమత్ నగర్ పి హెచ్ సి నందు అక్టోబర్ 6వ తేదీన జరిగే ఆశా డేను అదే నెలలో మరొక తేదీన జరపాలని కోరుతూ వైద్యాధికారి షెహానాజ్ బేగంకి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్స్‌కు కనీస వేతనాలు చెల్లించాలని, చట్టబద్ధమైన సెలవులు కల్పించాలన్నారు. ఆశాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. 2026 మార్చి 5వ తేదీన ఆశా వర్కర్స్ సమస్యలపై ప్రభుత్వంతో జరిగిన చర్చలు ఒప్పంద పత్రాల జీవోలును వెంటనే ఇవ్వాలన్నారు. ఆశాలకు పని భారాన్ని తగ్గించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని పెరుగుతున్న జనాభా కనుగుణంగా ఆశాల సంఖ్యను పెంచాలన్నారు. మాత శిశు సంరక్షణ పేరుతో నియమింపబడిన ఆశ వర్కర్స్ తో ప్రభుత్వము ఎల్లవెల్లాల పనులు చేయిస్తున్నది గర్భవతులు బాలింతలు పసిపిల్లల ఆరోగ్య సంరక్షణకు మోటివేట్ చేస్తే చాలు అనే పేరుతో నియమించి అన్ని రకాలైన పనులు ఊపిరి సలపకుండా చేస్తున్నారు. సర్వేల పేరుతో పని భారాన్ని తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఆశాలకు సంబంధం లేని సిబ్బంది చేయాల్సిన పనులు సైతం బలవంతంగా బెదిరించి చేస్తున్నారు. పండగలు తుఫానులు వరదలు, పరీక్షలు ఎన్నికల సందర్భంగా కూడా టీఏడీఏలు చెల్లించకుండా పనిచేయిస్తున్నారు. 20 ఏళ్లుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించడం లేదు కార్మికులుగా గుర్తించడం లేదు చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు జరపడం లేదు అనారోగ్యం పాలైన కుటుంబంలో ఎవరికైనా సుస్థి చేసినా సెలవులు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఆశా కార్యకర్తలకు గ్రూప్ ఇన్సూరెన్స్ 10 లక్షలు ఇవ్వాలని, కనీస వేతనాలు 26వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు జ్యోతి, లింగమ్మ, యశోద, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ జేడీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్

సుండి పెంట అక్టోబర్ 3 వార్త సాక్ష్యం

శ్రీశైలం మండలం సున్నిపెంట కాలనీలో మాజీ( సిబిఐ) 'జేడీ' లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఉచిత మెగా "మెడికల్ "క్యాంపు నిర్వహించడం జరుగుతుందని "స్పోస" సభ్యులు తెలియజేస్తున్నారు, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ నెల 10,11 తేదీలలో అంటే శని, ఆదివారముల లో గవర్నమెంట్ ఆసుపత్రి నందు ఈ ఉచిత మెగా మెడికల్ క్యాంపు జరుగుతుందని, శ్రీశైలం ప్రాజెక్టు ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ (స్పోస) చైర్మన్ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి లక్ష్మీనారాయణ గారి ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని, ఈ ఉచిత మెగా "మెడికల్" క్యాంపుకు, 'కంటి'కి సంబంధించిన డాక్టర్లే కాకుండా, డెంటల్, గుండె, ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్, మరియు నరాలకు సంబంధించిన డాక్టర్లందరూ బసవతారకం హాస్పిటల్ నుండి వస్తున్నారన్నారు. అంతేకాదు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు నిపుణులైన డాక్టర్లు ఎక్విప్మెంట్స్ తో సహా విచ్చేయుచున్నారు, ఈ ఉచిత మెగా మెడికల్ క్యాంపు నందు ఉచిత మెడిసిన్స్ అందజేయబడునని, అలాగే డాక్టర్లకు చూపించుకునే పేషెంట్స్ 10వ తారీకు ఉదయం 9 గంటలకి తమ పేరు నమోదు చేసుకోవాలని, ఈ మంచి అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, శ్రీశైలం ప్రాజెక్టు ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ (స్పోస) సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ ఉచిత మెగా మెడికల్ క్యాంపు నందు ప్రాజెక్టు "స్పోస" సభ్యులు అందరూ తప్పక పాల్గొనవలసినదిగా కోరడమైనది.



VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A9153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# త్వరలో జరగబోతున్న మున్సిపల్ ఎన్నికలకు ప్రభుత్వ ఉద్యోగులు సిద్ధంగా ఉండాలి

- సోమవారం అనంతపురం జిల్లాలో జరిగే ఎన్నికల శిక్షణకు హాజరు అవ్వండి.
- ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ బేబీ

ఆత్మకూరు అక్టోబర్ 3 వార్త సాక్ష్యం

రాష్ట్రంలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల శిక్షణ తీసుకొని సిద్ధంగా ఉండాలని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ బేబీ పేర్కొన్నారు శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఎలక్షన్ ఆఫీసర్లకు, అసిస్టెంట్ ఎలక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చారు ఈ కార్యక్రమానికి ఎన్నికల ట్రైనీ గా కొట్టాల చెరువు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వై వెంకటేశ్వర్లు వ్యవహరించారు శిక్షణ కార్యక్రమంలో నామినేషన్ మొదలుకొని ఎలక్షన్ రిజల్ట్ వచ్చేవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎలక్షన్ ఆఫీసర్లకు మాస్టర్ ట్రెనింగ్ సెక్షన్ ఇచ్చారు.. త్వరలో ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం మున్సిపల్ ఎలక్షన్ నోటిఫికేషన్ ఇవ్వబోతుందని, దానికి సంబంధించిన గ్రౌండ్ వర్క్ అంతా పూర్తయిందని కమిషనర్ తెలిపారు. ఈసారి ఎలక్షన్ బ్యాలెట్ విధానంలో జరగనుందని పేర్కొన్నారు. సోమవారం అనంతపురంలోని రీజనల్ మున్సిపల్ ఆఫీస్ లో ఎలక్షన్ ఆఫీసర్లకు రెండో దఫా శిక్షణ కార్యక్రమం ఉంటుందని, ఈ



కార్యక్రమానికి రీజియన్ స్థాయి ఎలక్షన్ ఆఫీసర్లు అందరూ శిక్షణకు హాజరవుతారని పేర్కొన్నారు. అనంతపురంలో జరిగే శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం నుండి అధికారులు పాల్గొని ఎలక్షన్ ఆఫీసర్లకు సూచనలు చేస్తారని కమిషనర్ బేబీ పేర్కొన్నారు.

# జస్ట్ వెయిట్.. త్వరలో గుడ్ న్యూస్... అంటూ కాలయాపన..!





- నిరాశ, నిస్పృహాల మధ్య వీబీ జీ రామ్ జీ ఉద్యోగులు
- పక్క వారి ఆకులో పంక్ష భక్ష పరమాన్నము..వీడి కేమో ఖాళీ ఆకు
- పంచాయతీ రాజ్ ు గ్రామీణాభివృద్ధి శాఖలో వివక్షత
- శుభవార్త కోసం వీబీ జీరామ్ జీ ఉద్యోగులు ఎదురు చూపులు

నంద్యాల అక్టోబర్ 3 వార్త సాక్ష్యం

రాష్ట్రఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ స్పందన కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్న వీబీజీ రామ్‌జీ ఉద్యోగులు. గ్రామీణా భివృద్ధి శాఖ (నరేగా/వీబీ–జీ రామ్‌జీ) ఉద్యోగుల వేతనాల పెంపు, పదోన్నతులు, సంక్షేమం మరియు సర్వీస్ ప్రయోజనాల కల్పన కోసం ఉద్యోగులు గత ఎనిమిది ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. పంచాయతీ రాజ్ శాఖలో వివిధ క్యాడర్ల ఉద్యోగులకు విస్తృత స్థాయిలో పదోన్నతులు కల్పించి, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ చారిత్రాత్మక నిర్ణయా లు తీసుకున్నందుకు గ్రామీణా భివృద్ధి శాఖ ఉద్యోగుల తరపున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నారు. పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖలు వేర్వేరు శాఖలైనప్పటికీ, గ్రామీణ ప్రజల అభ్యున్నతే ఉమ్మడి లక్ష్యంగా పనిచేస్తున్న సోదర సంస్థలు. ఒకే మంత్రి, ఒకే ప్రిన్సిపల్ సెక్రటరీ మరియు కమిషనర్ల పర్యవేక్షణలో ఈ రెండు శాఖలు పనిచేస్తున్న నేపథ్యం లో, పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులకు లభించిన అవకాశాలు మరియు సంక్షేమ చర్యలు గ్రామీణా భివృద్ధి శాఖ ఉద్యోగులకు కూడా సమానంగా అందాలని ఉద్యోగులు ఆకాంక్షిస్తున్నారు. అయితే, గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల కు వేతనాల పెంపు, పదోన్నతులు, సేవా భద్రత, సంక్షేమ అంశాలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉండడం వల్ల ఉద్యోగుల్లో నిరాశ నెలకొంది. వీబీ–జీ రామ్‌జీ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల భవిష్యత్తు, సేవా ప్రయోజనాలు మరియు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైనది. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని ఎస్ ఆర్ డి ఎస్ వెబ్సైట్ ప్రకారం మొత్తం 18,993 మంది వీబీ జీ రామ్ జీ లో పనిచేస్తున్నారు. మండల పరిధిలో ఏపీఓ లు, ఈసీ, జేఈలు, సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ సహాయకులు , క్షేత్ర సహాయకులు ఉన్నారు. ఉపాధిహామీ ఉద్యోగులు 4693 మంది, 192 మంది వాటర్ షెడ్ ఉద్యోగులు, 373 మంది తాత్కాలిక ఉద్యోగుల గా నియమించిన వారు, 1736 మంది outsourcing ఉద్యోగులు, 3214 మంది FTE ఫీల్డ్ అసిస్టెంట్లు, 8785 మంది ఇతర ఉద్యోగులు ఉన్నారు. ఈ నేపథ్యంలో, జూలై 1 నుండి వీబీ–జీ రామ్‌జీ చట్టం అమలులోకి వచ్చిన సందర్భంగా ఉద్యోగుల సంక్షేమం, సంస్కరణల అంశాలను సాను కూలంగా పరిశీలించిన ప్రభుత్వం ఇది వరకే ఉద్యోగుల సంఘాలతో పలు దఫాలగా సమావేశాలు నిర్వహించారు. జూలై 27 న కమిషనర్ వి ఆర్ కృష్ణ తేజ గ్రామీణాభివృద్ధి అధికారులతో సమీక్షా సమా వేశం నిర్వహించారు. అలాగే ఆగస్టు 6న పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉద్యోగులకు వేతనాల పెంపు, పదోన్నతులు, ఉద్యోగ భద్రత, గ్రాట్యూటీ సదుపాయం అమలు, క్యాష్‌లెస్ హెల్త్ కార్డుల మంజూరు. ఇతర సంక్షేమ మరియు పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించాలని కోరారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగుల సమస్యలను సానుభూతితో పరిశీలించి, న్యాయమైన నిర్ణయాలు తీసుకుంటారని విశ్వసిస్తున్నారు. గతంలో అనగా గత తెదేపా పాలనలో అప్పటి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ హయాంలో పెంచిన జీతాలు, పదోన్నతులు తప్పితే గత ఎనిమిది సంవత్సరాలగా ఏలాంటి చర్యలూ చేపట్టలేదని ఉద్యోగులు వాపోతు న్నారు. అప్పట్లో లోకేష్ తీసుకున్న నిర్ణయం వేలాది కుటుంబాలకు మేలు చేకూరునదని తెలిపారు. అలాగే కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శిలను రెగ్యులర్ చేస్తూ తీసుకున్న నిర్ణయం ఓ చరిత్ర. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీ రాజ్ ఉద్యోగులకు ఇచ్చిన ప్రాధాన్యత అంతా...ఇంతా కాదు. అధిక ప్రాధాన్యత ఇచ్చి చరిత్రలో నిలిచిపోయేలా పదోన్నతు లు కల్పించారు. అదే విధంగా గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న వీబీ జీ రామ్ జీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాది రూపాయలతో మౌలిక వసతులు కల్పించేందుకు మెటీరియల్ కాంపొనెంట్ నిధుల సమీకరణలో భాగంగా శ్రామికులకు వేతనాలు జనరేట్ చేయడంలో సిబ్బంది పాత్ర అమోఘమైన కృషి ఉన్నదనడంలో అతిశయోక్తి లేదు.

# డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పార్ట్‌టైం టీచర్ల పోరాటానికి ఐసా సంఘీభావం



- సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి
- పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

కర్నూలు అక్టోబర్ 3 వార్త సాక్ష్యం

గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం టీచర్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత ఆరు రోజులుగా నిరవధిక ధర్నా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐసా రాష్ట్ర కార్యదర్శి ఎస్. నాగార్జున ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉంది. పార్ట్‌టైం టీచర్లు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, తమను కాంట్రాక్ట్ పరిధిలోకి తీసుకురావాలని, నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. గురుకుల విద్యార్థులకు బోధన అందిస్తూ కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్న



ఉపాధ్యాయుల వేతనాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటం వారి జీవనోపాధిపై ప్రభావం చూపుతుందని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వం వారి డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి. పార్ట్‌టైం టీచర్ల పోరాటానికి వేమన సంఘీభావం తెలియజేస్తూ, వారి పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేసి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం.

- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.



నందికొట్కూరు అక్టోబర్ 3 వార్త సాక్ష్యం



నంద్యాల పార్లమెంట్ ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ దళిత కాలనీ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శనివారం జిల్లాలో ని నందికొట్కూరు నియోజకవర్గం, పగిడ్యాల మండలం పాత ముచ్చుమర్రి గ్రామ బస్టాండ్ సెంటర్ లో నంద్యాల ఎంపీ నిధులు రూ. 5 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ ను నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఎంపీ నిధులతో గ్రామాల్లో, ముఖ్యంగా దళిత, బడుగు బలహీన వర్గాల కాలనీలలో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామన్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్మాణాలకు నిధుల కొరత లేదని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముచ్చుమర్రి టీడీపీ సీనియర్ నాయకులు కాటం. వెంకటరామిరెడ్డి, రాఘవరెడ్డి, విద్యార్థి సంఘం నాయకులు కుమ్మరి. నాగరాజు, సుబ్బా రావు, బాలనారాయణ, నాగేశ్వరావు, చిన్న సుంకన్న, రాముడు, మాజీ మున్సిపల్ చైర్మన్ డి. సుధాకర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ నాగేశ్వరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్. కాకరవాడ. చిన్న వెంకటస్వామి, కట్టుబడి. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా స్వర్ణరథోత్సవం





శ్రీశైల దేవస్థానం అక్టోబర్ 3 వార్తా సాక్ష్యం

శ్రీశైలంలో ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈరోజు శ్రీస్వామి అమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది. కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా ఈ రోజు వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది. ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, అతివృష్టి అనావృష్టి నివారించబడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు లోకకల్యాణానికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించ బడ్డాయి. అనంతరం భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఉదయం గం. 7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, తప్పెట చిందులు, మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు దంపతులు, పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 04 అక్టోబర్ 2026

## శ్రీశైల దేవస్థానంలో సాంస్కృతిక కార్యక్రమాలు





శ్రీశైల దేవస్థానం అక్టోబర్ 3 వార్తా సాక్ష్యం

శ్రీశైల దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధనలో) ఈరోజు శ్రీ రాజరాజేశ్వర భరత కళాసేవాసమితి, హైదరాబాదు వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించబడుతున్నది. ఈ కార్యక్రమములో వినాయకకౌత్వం, ఓం నమశ్శివాయ, జతిస్వరం, నాగస్తుతి అఖిలాండేశ్వరి, శివతాండవం, శివాష్టకం తదితర గీతాలకు, అష్టకాలకు వైష్ణవి, గీతాశ్రీ, ఆరాధ్య, శ్రీకృతి, విజయలక్ష్మి, ప్రణిత, సిద్దేశ్వరి, అర్చన తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామి అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి.

# చెంచు గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కృషి







- శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి.
- చెంచు గిరిజన ఉద్యానవన రైతులకు ఐటిడిఏ ఆధ్వర్యంలో పరికరాలు పంపిణీ
- ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని అందిపుచ్చుకొని చెంచులు వ్యవసాయంలో రాణించాలి.
- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు సహకారంతో రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దేందుకు చర్యలు.
- యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం ప్రతి చెంచు కుటుంబానికి పక్కా గృహాలు అందిస్తాం.
- ప్రతి గూడెంలో మౌలికవసతుల కల్పించాం. విద్యా వైద్య సదుపాయాలను మెరుగుపరిచాం.
- చెంచుల అభివృద్ధికోసం దేశంలోనే మొట్టమొదటి సారి ఐటిడిఏ ను ఏర్పాటు చేసిన ఘనత
- దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుది
- శ్రీశైలం ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి

ఆత్మకూరు అక్టోబర్ 3 వార్త సాక్ష్యం

శ్రీశైలం నియోజకవర్గం లో చెంచు గిరిజనుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు శనివారం పట్టణంలోని ఐటిడిఏ అధికారుల ఆధ్వర్యంలో చెంచు గిరిజనులకు ఉద్యాన రైతులకు పనిముట్లు పంపిణీ చేశారు ముందుగా ఐటీడీఏ పీవో పి.వి నాయుడు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పూల పుష్పంతో ఘనంగా ఆహ్వానం పలికారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి చెంచు గిరిజనులకు ఉద్యాన పనిముట్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐటీడీఏ ఆధ్వర్యంలో చెంచు గిరిజనులకు అన్ని విధాలుగా ప్రభుత్వ అమలు చేసే సంక్షేమ పథకాలు అందించే విధంగా కూటమి ప్రభుత్వం నెలకొందని అన్నారు ముఖ్యంగా నియోజకవర్గంలో చెంచు గిరిజన గూడెలలో విద్యా వైద్యం, పక్కా గృహాలు నిర్మాణం చేపట్టి చెంచు గిరిజనులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని వివరించారు దేశంలోనే మొట్టమొదటిసారిగా ఐటిడిఏ కార్యాలయాలను ఏర్పాటుచేసిన చరిత్ర స్వర్గీయ నందమూరి ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకి దక్కిందని కొనియాడారు రాబోయే భావితరాలలో చెంచు గిరిజనులకు శ్రీశైలం నియోజకవర్గం లో అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి గిరిజనులకు భరోసా కల్పించారు ఈ కార్యక్రమంలో ఐటిడిఏ అధికారి కే.జి. నాయక్ శ్రీశైలం నియోజకవర్గం బిజెపి పార్టీ ఇన్చార్జి మోమిన్ షబాన, జనసేన పార్టీ శ్రీరాములు, టిడిపి మండల అధ్యక్షుడు రవీంద్రబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం భాష, టిడిపి పార్టీ సీనియర్ ఆర్యవైశ్య నాయకులు కొప్పారపు రవి ప్రసాద్ టిడిపి పార్టీ నాయకులు కార్యకర్తలు పలు శాఖల అధికారులు చెంచు గిరిజనులు తదితరులు పాల్గొన్నారు

# ఆసియా క్రీడల్లో భారత్ సత్తా..

## మలేషియా పై 5-1 ఘన విజయం, హాకీలో స్వర్ణం..




ఆసియా క్రీడలు 2026లో శనివారం కూడా భారత్ ఖాతాలో పసిడి పతకాలు వెల్లువెత్తాయి. హాకీలోనూ భారత్ స్వర్ణం సాధించింది. శుక్రవారం హాకీ మహిళల విభాగంలో భారత్ గోల్డ్ మెడల్ సాధించింది. దాదాపు 44 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఇండియా పసిడి పట్టింది. తాజాగా పురుషుల విభాగంలోనూ భారత జట్టు సత్తాచాటింది. మలేషియాపై విజయం సాధించింది మరో స్వర్ణాన్ని ఖాతాలో వేసుకుంది. శనివారం ఐచి-నగోయా వేదికగా భారత్, మలేషియా మధ్య తుదిపోరు జరిగింది. ఈ మ్యాచ్‌లో భారత హాకీ జట్టు 5-1 తేడాతో మలేషియాను చిత్తు చేసింది. ఈ విజయంతో స్వర్ణం గెలవడంతో పాటు చరిత్రలో తొలిసారి తమ ఆసియా టైటిల్‌ను విజయవంతంగా నిలబెట్టుకుంది. ఆట ఆరంభం నుంచి ఇరుజట్లూ గోల్స్ కోసం పోటీ పడ్డాయి. 11వ నిమిషంలో భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్ గా మలిచాడు. దీంతో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే 14వ నిమిషంలో మలేషియా గోల్ సాధించి పాయింట్లు సమం చేసింది. 23వ నిమిషంలో భారత్ ప్లేయర్ లక్రా గోల్ కొట్టాడు. ఇక అక్కడి నుంచి మలేషియాకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా భారత ప్లేయర్లు అదరగొట్టారు. మొత్తంగా ఐదు గోల్స్ చేసి విజయం ఖాయం చేసుకున్నారు. దీంతో ఒకే ఎడిషన్‌లో మహిళల,పురుషుల విభాగంలో బంగారు పతకం సాధించడం ఇదే తొలిసారి. తాజాగా గెలుపుతో భారత్ 2028 లాస్ ఏంజిల్స్ లో జరిగే ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించింది.

# ఆసియా క్రీడల క్రికెట్ విజేత టీమిండియా



ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో భారత జట్టు మరోసారి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోవడం తెలిసిందే. జపాన్‌లోని నిషిన్‌లో శనివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో పసిడిని నిలబెట్టుకుని సత్తా చాటింది. ఈ అద్భుత విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ భారత జట్టును అభినందించారు. ఇది దేశానికి ఎంతో ఆనందకరమైన సందర్భమని కొనియాడారు. "భారత్‌కు మళ్లీ స్వర్ణం దక్కింది! ఆసియా క్రీడల్లో టైటిల్ నిలబెట్టుకున్న మన పురుషుల క్రికెట్ జట్టుకు అభినందనలు. భవిష్యత్తులోనూ జట్టు సభ్యులు మరిన్ని విజయాలు సాధించాలి" అని ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. అంతకుముందు, ఐసీసీ ఛైర్మన్ జై షా కూడా జట్టును అభినందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ భారీ స్కోరు సాధించింది. అభిషేక్ శర్మ కేవలం 28 బంతుల్లో 61 పరుగులతో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. పాకిస్థాన్‌పై టీ20ల్లో ఒక భారత బ్యాటర్ చేసిన వేగవంతమైన అర్ధ సెంచరీ ఇదే. ఆ తర్వాత తిలక్ వర్మ 22 బంతుల్లోనే 51 పరుగులతో అజేయంగా నిలిచి స్కోరును పరుగులు పెట్టించాడు. వీరితో పాటు వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, శివమ్ దూబే కూడా రాణించడంతో భారత్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. అనంతరం 212 పరుగుల లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ కూడా గట్టిగా పోరాడింది. ఆ జట్టు బ్యాటర్ హసన్ నవాజ్ 51 బంతుల్లో 96 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. ఒక దశలో పాకిస్థాన్ గెలుపు దిశగా సాగుతున్నట్టు కనిపించినా, భారత బౌలర్లు చివరిలో ఒత్తిడిని జయించారు. కీలక సమయంలో వికెట్లు తీసి మ్యాచ్‌ను అదుపులోకి తెచ్చుకున్నారు. చివరి బంతికి నవాజ్‌ను శివమ్ దూబే ఔట్ చేయడంతో పాకిస్థాన్ ఇన్నింగ్స్ 6 వికెట్ల నష్టానికి 192 పరుగుల వద్ద ముగిసింది. దీంతో భారత ఆటగాళ్లు సంబరాల్లో మునిగిపోయారు.

# స్పోర్ట్స్

## ఆసియా క్రీడలకు ఘనమైన ముగింపు..

## భారత్‌కు 85 పతకాలు..



జపాన్‌లోని ఐచి-నగోయాలో జరిగిన 2026 ఆసియా క్రీడల్లో భారత్ 85 పతకాలతో తన ప్రస్థానాన్ని ముగించింది. ఇందులో 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్య పతకాలు ఉన్నాయి. అక్టోబర్ 3న పురుషుల హాకీ జట్టు స్వర్ణం గెలవడంతో భారత్ పతకాల సంఖ్య 85కు చేరింది. పురుషుల హాకీ ఫైనల్లో భారత్ 5-1తో మలేషియాను ఓడించింది. ఈ విజయంతో భారత్‌కు 21వ స్వర్ణం దక్కింది . 2022 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో భారత్ 106 పతకాలు సాధించింది. ఈసారి మొత్తం పతకాల సంఖ్య 21 తగ్గింది. సెప్టెంబర్ 30 నాటికి భారత్ కేవలం 10 స్వర్ణాలతో తొలి పది స్థానాల్లో కూడా లేదు. అయితే చివరి రెండు రోజుల్లో భారత క్రీడాకారులు వరుసగా పతకాలు సాధించారు. హాకీ, క్రికెట్, ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్‌లో భారత్‌కు కీలక విజయాలు లభించాయి. చివరి రెండు రోజుల్లోనే భారత్ 11 స్వర్ణాలు సాధించింది. దీంతో పతకాల పట్టికలో భారత్ తొలి ఐదు స్థానాల్లోకి చేరింది. ఈ క్రీడల్లో భారత్ 21 స్వర్ణ పతకాలు, 27 రజత పతకాలు, 37 కాంస్య పతకాలు సాధించింది. దీంతో ఐచి-నగోయా ఆసియా క్రీడల్లో భారత్ నాలుగో స్థానాన్ని ఖరారు చేసుకుంది. తొలి మూడు స్థానాల్లో చైనా (340), జపాన్ (266), దక్షిణ కొరియా (149) ఉన్నాయి. 70 పతకాలతో ఉజ్బెకిస్థాన్ ఐదో స్థానంలో నిలిచింది.

## బన్నీ-అట్లీ సినిమా పుకార్లకు చెక్ పెట్టిన ఐశ్వర్య లక్ష్మి



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రాబోతున్న పాన్-ఇండియా చిత్రం 'రాకా'పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో సినిమా క్యాస్టింగ్‌కు సంబంధించి వస్తున్న ఊహాగానాలకు నటి ఐశ్వర్య లక్ష్మి తెరదించారు. ఈ చిత్రంలో తాను నటిస్తున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆమె స్పష్టం చేశారు. గత కొన్ని రోజులుగా 'రాకా' చిత్రంలో ఐశ్వర్య లక్ష్మి ఒక కీలక పాత్రలో, ముఖ్యంగా నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతున్నారంటూ ప్రచారం జోరుగా సాగింది. ఈ పుకార్లపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందించిన ఆమె, "నేను ఆ సినిమాలో భాగం కాదు. దయచేసి ఎవరైనా నన్ను ఆ సినిమాలో తీసుకోండి" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఆమె వివరణతో ఈ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పడినట్లయింది. అల్లు అర్జున్-అట్లీ కాంబోలో వస్తున్న తొలి సినిమా కావడంతో 'రాకా'పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఇందులో దీపికా పదుకొణె నటిస్తున్నట్లు ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. వీరితో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్, రష్మిక మందన్న వంటి తారల పేర్లు కూడా పరిశ్రమ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఐశ్వర్య లక్ష్మి, అర్జున్ దాస్‌తో కలిసి నటించిన రొమాంటిక్ కామెడీ సిరీస్ 'లవ్'లో నటిస్తున్నారు. 'పొన్నియిన్ సెల్వన్' వంటి చిత్రాలతో ఈమె చాలా గుర్తింపు పొందారు.

# 'ఇంత దిగజారిపోయామా?'..

## 'చుట్టమల్లే' మార్ఫింగ్ వీడియో పై ఎన్టీఆర్‌కు విజయ్ దేవరకొండ మద్దతు





ఏఐ సాంకేతికతను ఇంత దారుణంగా దుర్వినియోగం చేయడంపై నటుడు విజయ్ దేవరకొండ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'దేవర' సినిమాలోని 'చుట్టమల్లే' పాటను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న ఘటనపై జూనియర్ ఎన్టీఆర్‌కు అతడు పూర్తి మద్దతు తెలిపారు. ఈ వీడియోను రూపొందించినవారిని, ప్రచారం చేస్తున్నవారిని అసలు వదిలిపెట్టకూడదన్నాడు. వారిపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరాడు. జూనియర్ ఎన్టీఆర్ పోస్టును తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేసిన విజయ్.. "మనం ఇంత దిగజారి పోయామా?ఒకరి పై ఒకరం ఇంత సున్నితత్వం కోల్పోయామా?" అని ప్రశ్నించాడు. ఇలాంటి కంటెంట్‌ను చూసి ఆనందించే స్థాయికి సమాజం ఎలా చేరిందో అర్థం కావడం లేదన్నాడు. "ఇలాంటి పిల్లలను ఎలా పెంచుతున్నారు? మనం ఎలాంటి సమాజంలో జీవిస్తున్నాం?" అంటూ తల్లిదండ్రుల పెంపకంపైనా విజయ్ ప్రశ్నలు సంధించాడు. ఒకరిని కించపరచడంలో ఆనందం పొందే పరిస్థితి రావడం బాధాకరమన్నాడు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయనే భయం ఉందని విజయ్ గుర్తు చేశాడు. అలాంటి సాంకేతికతను ఉపయోగించి మంచి పనులు చేయాల్సింది పోయి ఇలాంటి అర్థంలేని, నీచమైన పనులకు వాడుతున్నారని మండిపడ్డాడు. ఇలాంటి వీడియోను తయారు చేసి బయటకు తీసుకురావడాన్ని విజయ్ డిజిటల్ లైంగిక దాడితో సమానమైన చర్యగా అభివర్ణించాడు. ఇలాంటి ఘటనలను చట్టం అత్యంత తీవ్రంగా పరిగణించాలని కోరాడు. చివరగా ఈ వ్యవహారంపై పోరాడుతున్న జూనియర్ ఎన్టీఆర్, అతడి బృందానికి తన పూర్తి మద్దతు ఉంటుందని విజయ్ స్పష్టం చేశాడు. 'చుట్టమల్లే' పాటకు సంబంధించిన మార్ఫింగ్ వీడియోపై జూనియర్ ఎన్టీఆర్ ఇప్పటికే తీవ్రంగా స్పందించాడు. ఏఐ దుర్వినియోగంపై కఠిన నిబంధనలు తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరాడు.

# మాజీ మహిళా మావోయిస్టులకు బాలీవుడ్ ఛాన్స్!



ఛత్తీస్‌గఢ్‌లో హింసను వీడి జనజీవన స్రవంతిలో కలిసిన తొమ్మిది మంది మాజీ మహిళా మావోయిస్టులకు బాలీవుడ్‌లో నటించే అరుదైన అవకాశం లభించింది. ఇటీవల ఓ ఫ్యాషన్ షోలో వారు చేసిన ర్యాంప్ వాక్ వీడియో వైరల్ కావడంతో చిత్ర పరిశ్రమ దృష్టిని ఆకర్షించి, ఈ ఆఫర్ వారిని వరించింది. సుక్మా జిల్లాకు చెందిన ఈ తొమ్మిది మంది మహిళలు ఆగస్టులో రాయ్‌పూర్‌లో జరిగిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర గ్రామోద్యోగ్ శాఖ నిర్వహించిన ఈ షోలో వారు సంప్రదాయ వస్త్రాలు ధరించి ఎంతో ఆత్మవిశ్వాసంతో ర్యాంప్ వాక్ చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో 'బెంగాల్ 1947' చిత్ర దర్శకుడు ఆకాశ్ ఆదిత్య లామా వీరిని గమనించారు. తన తర్వాతి సినిమాలో వీరికి అవకాశం కల్పించేందుకు ఆయన ఆసక్తి చూపారు. 1994లో బస్తర్ ప్రాంతంలో జరిగిన ఒక సున్నితమైన వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. మావోయిజం ప్రభావిత ప్రాంతాల్లో జీవించిన ఈ మహిళల అనుభవాలు పాత్రలకు సహజత్వాన్ని తెస్తాయని చిత్రబృందం భావిస్తోంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో బస్తర్ అడవుల్లోనే షూటింగ్ జరపాలని ప్లాన్ చేస్తున్నారు. ఎంపికైన వారికి షూటింగ్‌కు ముందు ఆడిషన్లు నిర్వహించి, 10–15 రోజుల పాటు నటనలో ప్రత్యేక వర్క్‌షాప్ కూడా నిర్వహించనున్నారు. ఈ పరిణామంపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి హర్షం వ్యక్తం చేశారు. హింసను వీడిన వారికి ఇలాంటి అవకాశాలు రావడం వారి పునరావాసానికి, సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడపడానికి దోహదపడుతుందని అన్నారు. ఒకప్పుడు తుపాకులు పట్టిన చేతులతో ఇప్పుడు కెమెరా ముందుకు రానుండటం విశేషం.

## ఎస్ఐఆర్ కుట్రపూరితం.. సీఈసీ తక్షణమే వైదొలగాలి



ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్ డిమాండ్ చేశారు.దేశవ్యాప్తంగా వివాదాస్పదమైన ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉద్దేశపూర్వకంగానే కొందరి ఓట్లను తొలగించేందుకు ఈ ప్రక్రియ చేపట్టారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కింద దేశవ్యాప్తంగా సుమారు 13.4 కోట్ల మంది ఓటర్ల పేర్లను ముసాయిదా జాబితాల నుంచి తొలగించడం తీవ్ర వివాదానికి దారి తీసింది. ముఖ్యంగా వలస కార్మికులు, దళితులు, ముస్లింల ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగిస్తున్నారని ప్రకాశ్ రాజ్ ఆరోపించారు. ఇప్పటికే ఏటా ఓటర్ల జాబితా పరిశీలన జరుగుతుండగా, కొత్తగా ఈ ప్రత్యేక సవరణ ఎందుకని ఆయన ప్రశ్నించారు. దేశంలో అక్రమ చొరబాటు దారులు ఉంటే, ఇన్నాళ్లూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఏం చేసింది? అని నిలదీశారు. ఇంట్లో లేని వాళ్ల ఓట్లను తీసేశారని మండిపడ్డారు. ముస్లింలు, దళితుల ఓట్లను తొలగించడమే వారి ముఖ్య ఉద్దేశమని ఆరోపించారు. మరోవైపు, దేశవ్యాప్త నిరసనల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. జాబితాల నుంచి పొరపాటున తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చేందుకు నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించింది.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.